# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 సంచి10 | గురువారం, 11 సెప్టెంబర్ 2025 | పేజీలు: 06 | వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com




# తెలంగాణకు రక్షణ శాఖ భూములు!

**ఢిల్లీలో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌తో ముఖ్యమంత్రి రేవంత్ భేటీ**
**ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి రక్షణ శాఖ భూముల బదిలీ విజ్ఞప్తి**
**రాజీవ్ రహదారి విస్తరణకు 83 ఎకరాల భూమి అవసరం**
**తెలంగాణలో సైనిక్ స్కూల్ ఏర్పాటు చర్చల్లో ప్రస్తావన**

**ఢిల్లీ, ప్రజాస్వరం :**

ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా, తెలంగాణలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన రక్షణ శాఖ భూములను బదలాయించాలని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి స్కైవేలు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం అత్యవసరం అని ముఖ్యమంత్రి వివరించారు. ఈ ప్రాజెక్టుల నిర్మాణానికి రక్షణ శాఖ ఆధీనంలో ఉన్న భూములను రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరారు. ముఖ్యంగా, మెహదీపట్నం రైతుబజార్ వద్ద స్కై వాక్ నిర్మాణానికి భూమి అవసరమని, దీనివల్ల ప్రజలకు మెరుగైన సౌకర్యాలు లభిస్తాయని చెప్పారు. సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించిన మరో ముఖ్యమైన అంశం రాజీవ్ రహదారి విస్తరణ. హైదరాబాద్‌కరీంనగర్‌రామగుండంలను కలిపే ఈ రహదారిలో, ప్యాకేజీ జంక్షన్ నుండి ఔటర్ రింగ్ రోడ్డు జంక్షన్ వరకు ఆరు లేన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి 83 ఎకరాల రక్షణ శాఖ భూమి అవసరమని తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గుతుందని వివరించారు. వీటితో పాటు, తెలంగాణలో సైనిక్ స్కూల్ ఏర్పాటుపైనా ఈ సమావేశంలో చర్చ జరిగినట్లు సమాచారం. సీఎం వెంట పలువురు తెలంగాణ ఎంపీలు కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. రాజ్‌నాథ్ సింగ్‌తో జరిగిన ఈ సమావేశం రాష్ట్ర అభివృద్ధి ప్రాజెక్టులకు ఊతమిస్తుందని భావిస్తున్నారు. ..మిగతా 2లో

## కిషన్ రెడ్డి రాజీనామా చేస్తే.. నేను చేస్తా

**నాకు కేంద్ర పెద్దల ఆశీర్వదం ఉంది**
**పార్టీ పెద్దలు పిలిస్తే వెళ్తా.. ఇక్కడి విషయాలన్నీ చెబుతా**
**గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

ఎమ్మెల్యే రాజాసింగ్ పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఎమ్మెల్యే పదవికి రాజీనామా అంశంపై మాట్లాడారు. కిషన్ రెడ్డి రాజీనామా చేస్తే తానూ రాజీనామా చేస్తానని ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. దీనికి ప్లానింగ్ అంత కిషన్ రెడ్డి చేశారని ఆరోపించారు. తాను ఎప్పుడూ విమర్శలు చేయలేదని చెప్పారు.. కేంద్ర పెద్దల ఆశీర్వాదం, యోగి ఆధిత్యానాథ్ ఆశీర్వాదం తనకు ఉందన్నారు. గోషామహల్‌లో ఎవరికి పార్టీ పదవి ఇచ్చారని ప్రశ్నించారు. ఇవాళ కూడా నా బీజేపీనే రేపు కూడా నా బీజేపీనే అన్నారు. పెద్దలు ..మిగతా 2లో



## చిక్కుల్లో నయనతార



**హీరోయిన్ నయనతారకు నోటీసులు పంపిన మద్రాస్ హైకోర్టు**
**నెట్‌ఫ్లిక్స్ డాక్యుమెంటరీతో చిక్కుల్లోకి..**
**అనుమతి లేకుండా సినిమా క్లిప్స్ వాడకంపై వివాదం**
**'చంద్రముఖి', 'నాన్ రౌడీ ధాన్' చిత్రాల నిర్మాతల ఫిర్యాదు**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

ప్రముఖ సినీ నటి, లేడీ సూపర్‌స్టార్‌గా పేరు పొందిన నయనతార న్యాయపరమైన చిక్కుల్లో పడ్డారు. ఆమె జీవితం ఆధారంగా ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలైన 'నయనతార: బియాండ్ ది ఫెయిరీటేల్' అనే డాక్యుమెంటరీ తాజా వివాదానికి కేంద్ర బిందువుగా మారింది. ఈ డాక్యుమెంటరీలో తమ సినిమాలకు చెందిన క్లిప్పులను అనుమతి లేకుండా ఉపయోగించుకున్నారని ఇద్దరు నిర్మాతలు కోర్టును ఆశ్రయించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే, ఈ డాక్యుమెంటరీలో ..మిగతా 2లో

## ఫార్ములా ఈ రేస్ కేసులో ఏసీబీ దూకుడు

**9 నెలల విచారణ అనంతరం ఏసీబీ కీలక నివేదిక ప్రభుత్వానికి సమర్పణ**
**కేటీఆర్, ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌పై పలు సార్లు విచారణ**
**స్పాన్సర్ కంపెనీ నుంచి రూ.44 కోట్ల ఎలక్టోరల్ బాండ్లు – క్విడ్ ప్రో కో నిర్ధారణ**
**ఛార్జిషీట్ దాఖలు నిర్ణయంపై రాష్ట్ర ప్రభుత్వ ఉత్కంఠ**




**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

ఫార్ములా ఈ కార్ రేస్‌కు సంబంధించిన కేసులో తెలంగాణ ఏసీబీ (అవినీతి నిరోధక శాఖ) దర్యాప్తు వేగవంతం చేసింది. సుదీర్ఘంగా 9 నెలల పాటు సాగిన విచారణ అనంతరం, ఈ కేసులో కీలక నివేదికను ఏసీబీ ప్రభుత్వానికి ..మిగతా 2లో

## తులం బంగారం కాదు.. తులం ఇనుము కూడా ఇవ్వరు



**జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలను సొంత పోరాటంగా భావించాలి**
**కాంగ్రెస్ నాయకులపై డబ్బు వసూళ్ల ఆరోపణలు**
**మైనారిటీ నాయకులకు టికెట్లు ఇవ్వలేదు**
**బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ పిలుపు**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉప ఎన్నికల ముంగిట బీఆర్ఎస్ నేత కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికలు వస్తూ పోతూ ఉంటాయని, కానీ తమకు అండగా ..మిగతా 2లో



## 'సృష్టి' కేసులో కొత్త కోణం

**డాక్టర్ నమ్రతను ఒకరోజు కస్టడీకి తీసుకుని విచారణ**
**పదేళ్ల సరోగసి కార్యకలాపాల్లో కోట్లు వసూలు.. పోలీసులు ఆవిష్కరణ**
**నగదు లావాదేవీలు, బ్యాంక్ ఖాతాలు , యాప్ ఆధారిత అక్రమాలు**
**మరింత కస్టడీ , సీరియస్ దర్యాప్తు**

02



## మేడారం జాతరపై రాజకీయాలు వద్దు

**కేసీఆర్‌పై మేడారం జాతర నిర్లక్ష్యం ఆరోపణలు**
**గద్దెల మార్పుపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష**
**తప్పుడు ప్రచారం చేస్తున్నారని సీతక్క ఆగ్రహం**
**భక్తుల సౌకర్యాలను ప్రతిష్టాత్మకంగా చూస్తున్న ప్రభుత్వం**

02

## నేపాల్‌లో చిక్కుకున్నవారికి అండగా సర్కార్

**నేపాల్ సంక్షోభంతో తెలంగాణ వారి కోసం హెల్ప్‌లైన్**
**విదేశాంగ మంత్రిత్వ శాఖ, భారత రాయబార కార్యాలయంతో సమన్వయం**
**అత్యవసర సమయంలో సంప్రదించాల్సిన వివరాల వెల్లడి**



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

నేపాల్‌లో నెలకొన్న అల్లర్లు, రాజకీయ అస్థిరత నేపథ్యంలో, తెలంగాణ ప్రభుత్వం అక్కడి పౌరులకు అండగా నిలిచింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఒక ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసింది. నేపాల్‌లో చిక్కుకున్న తెలంగాణ పౌరులకు, వారి కుటుంబ సభ్యులకు సహాయం అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ప్రస్తుతానికి, ఏ తెలంగాణ పౌరుడికి గానీ గాయాలు లేదా అదృశ్యమైనట్లు ఎలాంటి నివేదికలు అందలేదు. అయినప్పటికీ, తెలంగాణ ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ, అలాగే కాఠ్మండులోని భారత రాయబార కార్యాలయంతో సమన్వయం ..మిగతా 2లో



# కిషన్ రెడ్డి రాజీనామా చేస్తే.. నేను చేస్తా

మొదటిపేజీ తరువాయి

పిలిస్తే వెళ్తా.. ఇక్కడ ఉన్న అన్ని విషయాలు చెబుతా అని ఎమ్మెల్యే రాజాసింగ్ తెలిపారు. పార్టీ లోకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. బీజేపీ తప్పు చేసినప్పుడల్లా తాను మాట్లాడుతూనే ఉంటానని చెప్పారు. రబ్బర్ స్టాంప్ గా మారొద్దని రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావుకు సూచించారు. చివరగా ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను ఎమ్మెల్యేగా రాజీనామా చేయనని ఏమీ పీక్కుంటారు పిక్కోండని ఘాటు వ్యాఖ్యలు చేశారు. మరోవైపు.. రాజాసింగ్ వ్యాఖ్యలపై రాష్ట్ర బీజేపీలో చర్చ కొనసాగుతోంది. పార్టీ పెద్దలు ఈ వ్యాఖ్యలును తప్పుపడుతున్నారు.

**రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే రాజకీయ సన్యాసం చేస్తా**

తనను టార్గెట్ చేస్తూ బీజేపీ ఆఫీస్ లో ప్రెస్ మీట్ పెట్టారని ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు.. తాను బీజేపీకి రాజీనామా జరగడానికి కారణం అందులో తప్పులు జరుగుతున్నాయని తెలిపారు.. బీజేపీ కార్యకర్తలను పక్కన పెడుతున్నారని రాజీనామా చేసినట్లు వెల్లడించారు. ఇంకా ఎన్ని రోజులు తనను టార్గెట్ చేస్తారని అడిగారు. తాను బీజేపీ కార్యకర్తల కోసం మాట్లాడానన్నారు. బీజేపీ రాష్ట్ర కమిటీలో 10 నుంచి 12 మందిని సికింద్రబాద్ పార్లమెంట్ నుంచి తీసుకున్నారని చెప్పారు. ఇంతకీ ఇది రామచందర్ రావు కమిటీ నా? మా కిషన్ రెడ్డి వేసిన కమిటీ నా? అని ప్రశ్నించారు. ఈ కమిటీతో బీజేపీ ప్రభుత్వాన్ని తెలంగాణలో తీసుకువస్తారా అన్నారు. ఒక వేళ తీసుకొస్తే నేను రాజకీయ సన్యాసం చేస్తా అని సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలతో తనకు మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. పార్టీని సర్వనాశనం చేస్తున్నారని వారు ఫోన్ చేసి చెబుతున్నారు. ఎంపీలు ఈ కమిటీతో సంతృప్తిగా ఉన్నారని చెప్పారు. ఆ విషయాన్ని బయటకు చెప్పారన్నారు.

# చిక్కుల్లో నయనతార

మొదటిపేజీ తరువాయి



'చంద్రముఖి' సినిమాకు సంబంధించిన కొన్ని క్లిప్పులను, 'నాన్ రౌడీ ధాన్' చిత్రానికి చెందిన తెర వెనుక ఫుటేజీని తమ అనుమతి లేకుండా ఉపయోగించుకున్నారని ఆయా చిత్రాల నిర్మాతలు ఆరోపిస్తున్నారు. ఇది కాపీరైట్ నిబంధనలను ఉల్లంఘించడమేనని వారు పేర్కొన్నారు. దీంతో 'చంద్రముఖి' నిర్మాత ఏపీ ఇంటర్నేషనల్, 'నాన్ రౌడీ ధాన్' నిర్మాత అయిన నటుడు ధనుష్‌కు చెందిన నిర్మాణ సంస్థ కలిసి మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. బుధవారం ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, నయనతారతో పాటు ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్‌కు కూడా నోటీసులు జారీ చేసింది. ఈ వివాదంపై అక్టోబర్ 6వ తేదీలోగా తమ వివరణ సమర్పించాలని ఆదేశించింది. న్యాయస్థానం ఆదేశాలతో ఈ వ్యవహారం కోలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. ఈ నోటీసులపై నయనతార, నెట్‌ఫ్లిక్స్ ఏ విధంగా స్పందిస్తాయో వేచి చూడాలి.



# నేపాల్‌లో చిక్కుకున్న వారికి అండగా సర్కార్

మొదటిపేజీ తరువాయి

చేసుకుంటూ, అక్కడ ఉన్న తమ పౌరుల భద్రతను, అలాగే వారిని సురక్షితంగా వెనక్కి రప్పించే ఏర్పాట్లను పర్యవేక్షిస్తోంది.

**సహాయం కోసం తెలంగాణ పౌరులు ఈ క్రింది అధికారులను సంప్రదించవచ్చు:**

ప్రైవేట్ సెక్రటరీ, రెసిడెంట్ కమిషనర్ & లైజన్ హెడ్ వందన. ఫోన్: +91 9871999044.

లైజన్ ఆఫీసర్ జి. రక్షిత్ నాయక్ ఫోన్: +91 9643723157.

పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ సిహెచ్. చక్రవర్తి.. ఫోన్: +91 9949351270.

పౌరులందరూ అధికారిక ప్రకటనలను మాత్రమే అనుసరించాలని, ధృవీకరించని సమాచారాన్ని నమ్మవద్దని, ఇతరులకు పంపవద్దని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో తన ప్రజల భద్రత, సంక్షేమం పట్ల తెలంగాణ ప్రభుత్వం నిబద్ధతతో ఉందని ఈ సందర్భంగా పేర్కొంది.



# మేడారం జాతరపై రాజకీయాలు వద్దు

- కేసీఆర్‌పై మేడారం జాతర నిర్లక్ష్యం ఆరోపణలు
- గద్దెల మార్పుపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష
- తప్పుడు ప్రచారం చేస్తున్నారన్న సీతక్క
- భక్తుల సౌకర్యాలను ప్రతిష్టాత్మకంగా చూస్తున్న ప్రభుత్వం

తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :

మేడారం మహాజాతర నేపథ్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఏబీఎన్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మంత్రి సీతక్క కీలక వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వం, ముఖ్యంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మేడారం జాతర అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని ఆమె ఆరోపించారు. కానీ ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జాతర నిర్వహణ, అభివృద్ధి పనులపై ముందుగానే ప్రణాళికలు రూపొందించి, వాటిని స్వయంగా పర్యవేక్షిస్తున్నారని సీతక్క తెలిపారు. మేడారం జాతరలో భక్తులు వేసే కానుకలను, బంగారం, డబ్బును ఉంచే గద్దెల వద్ద కొన్ని మార్పులు చేస్తున్నట్లు సీతక్క వెల్లడించారు. తాము, పూజారులు కలిసి చేసిన మార్పులు సీఎం రేవంత్ రెడ్డికి సంతృప్తి కలిగించలేదని, అందుకే ఆయనే స్వయంగా గద్దెల వద్దకు వచ్చి పరిస్థితిని సమీక్షించనున్నారని ఆమె వివరించారు. ఈ నెల 13న లేదా 14న సీఎం మేడారం పర్యటనకు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. గద్దెల మార్పుపై కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. పూజారులు, భక్తుల మనోభావాలు దెబ్బతినకుండానే ఈ మార్పులు చేస్తున్నామని ఆమె స్పష్టం చేశారు. "మేడారం జాతర ఒక పవిత్రమైన ఉత్సవం. దానిని రాజకీయాలకు వేదికగా మార్చవద్దు. ఇది కేవలం భక్తితో చూడాల్సిన విషయం" అని ఆమె హితవు పలికారు. మహాజాతర సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారికి సౌకర్యాలు మెరుగుపరచడానికే ఈ మార్పులు చేస్తున్నట్లు మంత్రి సీతక్క పేర్కొన్నారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన జాతరకు ఇప్పుడు సరైన ప్రాధాన్యత ఇస్తున్నామని, భక్తులు సంతోషంగా తమ మొక్కులు చెల్లించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామని ఆమె అన్నారు. తెలంగాణ ప్రభుత్వం మేడారం జాతరకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, భక్తుల భద్రత, సౌకర్యాలపై పూర్తి శ్రద్ధ పెట్టిందని సీతక్క చెప్పారు. జాతర నిర్వహణలో గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా చూస్తున్నామని, ఇది రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌గా భావిస్తోందని ఆమె తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి పర్యటన తర్వాత ఈ పనుల వేగం మరింత పుంజుకుంటుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

# తులం బంగారం కాదు.. తులం ఇనుము కూడా ఇవ్వరు

మొదటిపేజీ తరువాయి

నిలిచిన మాగంటి కుటుంబానికి అండగా నిలబడాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. త్వరలో జరగబోయే ఉప ఎన్నికలను ప్రతి కార్యకర్త తన సొంత పోరాటంగా భావించి పనిచేయాలని ఆయన ఉద్ఘాటించారు. కాంగ్రెస్ నాయకులు 'హైడ్రా' పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఆ డబ్బులతో జూబ్లీహిల్స్‌లో ఓట్లు కొనాలని చూస్తున్నారని విమర్శించారు. అంతేకాకుండా, కాంగ్రెస్ నాయకులు దొంగ ఓట్లను రాయించారని, వాటిని తొలగించే బాధ్యతను బీఆర్ఎస్ నాయకులు తీసుకోవాలని సూచించారు. అక్టోబర్ చివరి వారంలో గానీ, నవంబర్ మొదటి వారంలో గానీ ఉప ఎన్నికలు జరిగే అవకాశం ఉందని, బీహార్‌తో పాటు ఈ ఎన్నికలు రాబోతున్నాయని చెప్పారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు జిల్లాల్లో ప్రజలు



మోసపోయారని, కానీ హైదరాబాద్ ప్రజలు మాత్రం వారిని నమ్మలేదని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ నాయకులు తులం బంగారం ఇచ్చే వాళ్ళు కాదు, మెడలో పుస్తెలను గుంజుకెళ్లే వాళ్ళు అంటూ తీవ్రంగా విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తులం బంగారం కాదు కదా, తులం ఇనుము కూడా ఇవ్వడని ఎద్దేవా చేశారు. బతుకమ్మ, దసరా పండుగల ముందు ప్రజల వద్దకు వెళ్లి వారి అవసరాలు తీర్చాలని కార్యకర్తలకు సూచించారు. గతంలో మైనారిటీ నాయకుడైన అజారుద్దీన్‌కు సీటు ఇచ్చి, ఇప్పుడు ఆయనకు టికెట్ ఇవ్వకుండా బాగా డబ్బులు ఉన్నవారికి ఇస్తున్నారని కాంగ్రెస్‌పై కేటీఆర్ విమర్శలు గుప్పించారు. మైనారిటీలకు టికెట్ ఇవ్వనప్పుడు వారు కాంగ్రెస్‌కు ఎందుకు ఓటు వేయాలని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ వాళ్ళు ఓటుకు పైసలు ఇస్తే తీసుకోవాలని, కానీ ఓటు మాత్రం తమకే వేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ వ్యాఖ్యలు జూబ్లీహిల్స్ రాజకీయాల్లో మరింత చర్చకు దారితీసే అవకాశం ఉంది.

# 'సృష్టి' కేసులో కొత్త కోణం

- డాక్టర్ నమ్రతను ఒకరోజు కస్టడీకి తీసుకుని విచారణ
- పదేళ్ల సరోగసి కార్యకలాపాల్లో కోట్లు వసూలు.. పోలీసులు ఆవిష్కరణ
- నగదు లావాదేవీలు, బ్యాంక్ ఖాతాలు , యాప్ ఆధారిత అక్రమాలు
- మరింత కస్టడీ , సీరియస్ దర్యాప్తు

తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :

సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌పై కొనసాగుతున్న విచారణలో కేంద్ర క్రిమినల్ సర్వీస్ పోలీసులు కీలక వివరాలను సేకరిస్తున్నారు. ఈ క్రమంలో, ప్రధాన నిందితురాలు డాక్టర్ నమ్రత ను ఒకరోజు కస్టడీకి తీసుకుని వివరమైన విచారణ చేపట్టారు. ఈ కేసులో ఏజెంట్ల నియామకం, శిశువుల కొనుగోలు, అక్రమ కార్యకలాపాలకు సహకరించిన అనేక డాక్టర్ల వివరాలను సీసీఎస్ అధికారులు సేకరిస్తున్నట్లు తెలిపారు. పోలీసుల దర్యాప్తు ప్రకారం, నమ్రత పదేళ్లుగా సరోగసి ముసుగులో కోట్ల రూపాయల వరకు వసూలు చేసిందని గుర్తించబడింది. సరోగసి కోసం హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ ప్రాంతాల నుండి వచ్చే దంపతుల వివరాలను ఆమె వేర్వేరు రికార్డులుగా నిర్వహించింది. అంతేకాకుండా, నమ్రత అక్రమంగా వచ్చిన నగదు లావాదేవీల కోసం తన సిబ్బంది పేరుతో బ్యాంకు ఖాతాలను ఉపయోగించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ లావాదేవీలు ప్రత్యేకంగా రూపొందించిన యాప్ ద్వారా నిర్వహించబడుతున్నాయి అనే అంచనాలు కూడా వెలుగులోకి వచ్చాయి. ఈ తాజా వివరాల ఆధారంగా, సిసిఎస్ అధికారులు నమ్రతను మరొకసారి కస్టడీకి తీసుకుని విస్తృత విచారణ చేపట్టే అవకాశం ఉందని వెల్లడించారు. పోలీసులు ఆమె అక్రమ కార్యకలాపాలకు సంబంధించి సాక్ష్యాలను సేకరిస్తూ, మొత్తం వ్యవహారాన్ని పూర్వ వైవిధ్యంతో అన్వేషిస్తున్నారు. సృష్టి ఫెర్టిలిటీ కేసు సంచలనంగా మారడంతో, రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు ఈ వ్యవహారాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకుని పూర్తి స్థాయిలో విచారణ కొనసాగిస్తున్నారు. డాక్టర్ నమ్రత, ఆమె సహకారులతో పాటు, సరోగసి, శిశు వ్యాపారం, నగదు లావాదేవీలు, అక్రమ నెట్‌వర్క్ పై కూడా దర్యాప్తు జోరుగా కొనసాగుతున్నది.

## ఫార్ములా ఈ రేస్ కేసులో
# ఏసీబీ దూకుడు

మొదటిపేజీ తరువాయి

సమర్పించింది. నివేదికలోని అంశాల ఆధారంగా, అప్పటి మంత్రి కేటీఆర్‌తో పాటు పలువురిపై ఛార్జిషీట్ దాఖలు చేయడానికి అనుమతి కోరింది. ప్రభుత్వం నుండి అనుమతి రాగానే ఛార్జిషీట్ దాఖలు చేయనున్నట్లు ఏసీబీ వర్గాలు తెలిపాయి. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠకు దారితీసింది. ఈ కేసులో ఏసీబీ, అప్పటి ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ను ఇప్పటికే నాలుగు సార్లు విచారించింది. అలాగే, ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ను ఐదు సార్లు విచారించి వారి స్టేట్‌మెంట్‌లను రికార్డ్ చేసింది. వీరితో పాటు బీఎల్ఎన్ రెడ్డి, కిరణ్ రావు, ఫార్ములా ఈ ఆర్గనైజర్లను (FEOలు) కూడా విచారించినట్లు ఏసీబీ నివేదికలో పేర్కొంది. ఏసీబీ విచారణలో ఫార్ములా ఈ రేస్ నిర్వహణలో క్విడ్ ప్రో కో (ఎవరో ఒకరు ఏదో ఇస్తే, దానికి ప్రతిఫలంగా మరొకరు వారికి ఏదో ఇవ్వడం) జరిగిందని నిర్ధారించినట్లు సమాచారం. ఈ రేసుకు స్పాన్సర్‌గా ఉన్న కంపెనీ, అప్పటి అధికార పార్టీకి రూ. 44 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్లను చెల్లించినట్లు ఏసీబీ గుర్తించింది. ఈ లావాదేవీలు క్విడ్ ప్రో కోకు నిదర్శనమని ఏసీబీ తన నివేదికలో స్పష్టం చేసింది. ఏసీబీ తమ నివేదికను ఇప్పటికే ప్రభుత్వానికి అందజేసింది. ఈ నివేదికపై అడ్వకేట్ జనరల్‌తో న్యాయ సలహా తీసుకున్న ప్రభుత్వం, త్వరలో దీనిపై ఒక నిర్ణయం తీసుకోనుంది. ప్రభుత్వం నుండి అనుమతి రాగానే కేటీఆర్, అరవింద్ కుమార్ సహా నిందితులపై ఏసీబీ ఛార్జిషీట్ దాఖలు చేస్తుంది. ఈ కేసులో కఠిన చర్యలకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ నివేదికను గవర్నర్‌కు కూడా ఏసీబీ అందజేసినట్లు సమాచారం.



# తెలంగాణలో నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు

- వెల్లడించిన హైదరాబాద్ వాతావరణ కేంద్రం
- ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో రేపు, ఎల్లుండి వర్షాలు
- నాలుగు రోజుల పాటు హైదరాబాద్‌లో వర్షం కురిసే అవకాశం

తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :

తెలంగాణ రాష్ట్రంలో రానున్న నాలుగు రోజుల పాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. గురు, శుక్రవారాల్లో ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని, రానున్న నాలుగు రోజులు హైదరాబాద్‌లోనూ వర్షం కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈరోజు ఆదిలాబాద్, కొమురంభీమ్ ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, సిరిసిల్ల, భూపాలపల్లి, మహబూబాబాద్, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉంది. రేపు కొమురంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఇదిలా ఉండగా, ఈరోజు సాయంత్రం హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. సికింద్రాబాద్, బోయినపల్లి, తిరుమలగిరి, అల్వాల్, బొల్లారం, ప్యాట్నీ, ప్యారడైజ్, మారేడుపల్లి తదితర ప్రాంతాల్లో వర్షం కురవడంతో నగరవాసులు ఉక్కపోత నుంచి ఉపశమనం పొందారు. అయితే, భారీ వర్షం కారణంగా రహదారులపై నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

## కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



**మెదక్, సెప్టెంబర్ 10 (ప్రజా స్వరం) :**
పేదింటి ఆడపడుచులకు అండగా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం ఉపయోగపడుతుందని మెదక్ నియోజకవర్గ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. బుధవారం పాపన్నపేట మండల కేంద్రం ఎంపీడీవో కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ గ్రామాలకు సంబంధించి 62 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, 04 షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. మహిళలు ఈ డబ్బులను వృథా చేయకుండా అవసరానికి వినియోగించుకోవలన్నారు. పేదింటి ఆడపిల్లకు ఈ పథకం ఆర్థికంగా భరోసా కల్పించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, వివిధ ప్రజాప్రతినిధులు ప్రభుత్వాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కవిత్వంలో కాళోజీ ప్రత్యేక గుర్తింపు

- **కవిగా సమాజానికి ఆయన చేసిన సేవలు మరువలేనిది**
- **జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు**
- **ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు**



**మెదక్, సెప్టెంబర్ 10, (ప్రజా స్వరం) :**
జాతీయ కవి, ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళోజీ తెలంగాణ కు కవిత్వం ద్వారా ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చిన మహానుభావులు అని పేర్కొన్నారు. ఆయన రచనలు సామాజిక చైతన్యాన్ని పెంపోందిచేలా, ప్రజా హక్కుల కోసం నడిపించేలా ఉంటాయని గుర్తు చేశారు. ఉద్యమకారుడిగా, కవిగా ఆయన సమాజానికి చేసిన సేవలు మరువలేనివని అన్నారు. జిల్లా పోలీసులు తమ విధుల్లో ప్రజా సేవను ప్రధాన ధ్యేయంగా తీసుకుని, కాళోజీ ఆలోచనలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెదక్ అదనపు ఎస్పీ మహేందర్, సైబర్ క్రైమ్ డీఎస్పీ సుభాష్ చంద్ర బోస్, ఏఆర్ డీఎస్పీ రంగా నాయక్, ఎస్బిఐ ఇన్స్పెక్టర్ సందీప్ రెడ్డి, డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ మధు సుధన్ గౌడ్, ఆర్ఐ లు రామకృష్ణ, శైలందర్ సిబ్బంది పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోండి



- **శామీర్‌పేట పోలీసులకు వినతి పత్రం అందజేసిన బీజేపీ నాయకులు**

**శామీర్‌పేట, (ప్రజాస్వరం) :**
శామీర్‌పేట్ లోని రాజీవ్ రహదారి పై రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని శామీర్ పేట్ సీఐ ని బీజేపీ నాయకులు కోరారు. అతివేగంగా వచ్చే వాహనాలను అదుపుచేసేందుకు శామీర్ పేట్ లోని నల్సార్ చౌరస్తా వద్ద, ఆరెంజ్ బౌల్ చౌరస్తా వద్ద సిగ్నల్స్, చిన్నపాటి రేడియం తో కూడిన స్పీడ్ బేకర్ లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ రెండు చౌరస్తాల వద్ద అతివేగంగా వాహనాలు రావడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాల నివారణకు సిగ్నల్స్, రేడియం స్పీడ్ బేకర్ లు, భారీ గెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. దీనిపై శామీర్ పేట్ పోలీస్ స్టేషన్ లో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు శివ, శ్రీకాంత్, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

## రాజీ మార్గమే రాజమార్గం

- **శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్**




**శామీర్‌పేట, సెప్టెంబర్ 10 (ప్రజాస్వరం) :**
సెప్టెంబర్ 10వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జరిగే లోక్ అదాలత్ పై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలనే దిశగా పోలీస్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ మాట్లాడుతూ, "ప్రతి వ్యక్తి జీవితంలో తప్పులు జరగవచ్చు. చాలా సందర్భాలలో అవి తెలియక, ఆవేశంలో లేదా అనుకోకుండా జరుగుతాయి. అలాంటి సందర్భాలలో లోక్ అదాలత్ ప్రజలకు దగ్గరగా ఉండే సులభమైన, న్యాయమైన మార్గం. కేసులను త్వరగా, ఖర్చుల్లేకుండా పరిష్కరించుకునే వేదిక ఇదే. ప్రజలకు మేలు చేసే, సమాజ శాంతి స్థాపించే మార్గమే రాజీ మార్గము" అని పేర్కొన్నారు. అంతేకాక, ఆయన మాట్లాడుతూ "ప్రజల మధ్య సఖ్యత, శాంతి నెలకొల్పడం కోసం లోక్ అదాలత్ అనేది న్యాయ వ్యవస్థలో ఒక వెలుగునిచ్చే దీపం. దీనివల్ల వివాదాలు సులభంగా పరిష్కారం పొందుతాయి. ప్రజల సమయం, డబ్బు, శ్రమ ఆదా అవుతుంది. అందుకే ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి" అని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా-కేసుల త్వరిత పరిష్కారం ప్రజలకు న్యాయం అందించడం. కుటుంబ, ఆస్తి, ఇతర తగాదాలకు శాంతియుత పరిష్కారం. సమాజంలో సఖ్యత పెంపొందించడం జరుగుతుందని ఆయన తెలిపారు.




## వీర వనిత ఐలమ్మ

**మెదక్, సెప్టెంబర్ 10 (ప్రజా స్వరం) :**
చాకలి ఐలమ్మ వర్ధంతి పురస్కరించుకుని బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్దాస్ మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా కేంద్రం లోని చాకలి ఐలమ్మ విగ్రహానికి నాయకులతో కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వల్దాస్ మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ భూమిని కౌలుకు తీసుకుని వరి ధాన్యాన్ని పండించుకుంటే ఆ ధాన్యాన్ని దోచుకెళ్లిన దొరల దురంకాహారాన్ని ఎండగట్టిన తెలంగాణ వీర వనిత ఐలమ్మ అని తెలిపారు. భూమి కోసం భుక్తి కోసం వేట్టి చాకిరి విముక్తి కోసం దొరల ఆధిపత్యంతో నిజాం నవాబ్ తొత్తులుగా మారి బీసీ లు అణగారిన కులాలను అంటరాని వారిగా చూస్తున్న సంస్కృతికి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంతో చరమగీతం పాడిన నారిమణి ఐలమ్మ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రంజిత్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, ఓబీసీ మోర్చా కార్యదర్శి బక్క వారి శివ, మాజీ ప్రధాన కార్యదర్శి నల్లాల విజయ్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## విద్య బోధనను మెరుగు పర్చడం కోసం టీఎల్ఎం

- **విద్యార్థులను ఆకట్టుకునే విధంగా బోధన ప్రదర్శనలు**
- **ఉత్తమ ప్రదర్శనలను రాష్ట్ర స్థాయి కి ఎంపిక**
- **జిల్లా విద్యాధికారి రాధా కిషన్**

**మెదక్, సెప్టెంబర్ 10 (ప్రజా స్వరం) :**
ప్రాథమిక స్థాయిలో విద్య బోధనను మెరుగుపరచడం కోసం విద్యా ఆభ్యసన సామర్థ్యం ఎంతో అవసరమని జిల్లా విద్యాధికారి రాధా కిషన్ అన్నారు. బుధవారం మెదక్ జిల్లా కేంద్రం వెస్లీ హై స్కూల్ లో టిఎల్ఎం మేళా ను జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో చదివే పిల్లల యొక్క అవగాహన సామర్థ్యం తక్కువగా ఉంటుందని, ఏదైనా చెబితే వినాలని కోరిక తక్కువగా ఉంటుందన్నారు. ఆట, పాటల ద్వారా విషయాన్ని బోధిస్తే పిల్లలు పూర్తిగా నిమగ్నమై నేర్చుకునే అవకాశం ఉంటుందన్నారు. బోధన అభ్యసన సామాగ్రిని ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయుల ద్వారా చేయించి మండల స్థాయిలో ప్రదర్శించి, మండల స్థాయిలో ఉత్తమ ప్రదర్శనను గుర్తించి జిల్లా స్థాయిలో ప్రదర్శింపజేయడం జరిగిందని జిల్లాస్థాయిలో ఉత్తమంగా ఎంపికైన వాటిని రాష్ట్ర స్థాయి కి పంపించడం జరుగుతుందని అన్నారు. ఉత్తమమైన వాటిని వీడియో రూపొందించి మెదక్ జిల్లా డీఈవో యూట్యూబ్ ఛానల్లో అప్లోడ్ చేయడం జరుగుతుందని వాటి ద్వారా పాఠశాలల్లో ఉపాధ్యాయులు ప్రాథమిక స్థాయి విద్యార్థులకు గుణాత్మక బోధన చేసి, ఎఫ్ ఎల్ ఎన్ లో జిల్లా స్థానాన్ని ముందుకు వెళ్లే విధానంగా కృషి చేయాలన్నారు. ఈ జిల్లా స్థాయి ప్రదర్శనల్లో 208 వచ్చాయని, వాటిలో 10 ఉత్తమమైన ప్రదర్శన లను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి కి పంపించడం జరుగుతుందని అన్నారు.







## మార్కెట్ కమిటీ చైర్మన్‌ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడిగా ముప్ప గంగారెడ్డి




- **ప్రధాన కార్యదర్శిగా బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్**

**శామీర్‌పేట, సెప్టెంబర్ 10(ప్రజాస్వరం) :**
రాష్ట్ర మార్కెట్ కమిటీ చైర్మన్ ల ఫోరం అధ్యక్షుడిగా నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నరసింహ యాదవ్, గౌరవ అధ్యక్షులుగా గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం తుమ్మల నాగేశ్వర రావు నూతనంగా ఎన్నికైన ఫోరం సభ్యులను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ తోటకూర వజ్రష్ యాదవ్ ను కలిశారు. మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్, చైర్మన్ ల ఫోరం ప్రధాన కార్యదర్శిగా బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్ ఎన్నికైనందున తోటకూర వజ్రష్ యాదవ్ శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. పలువురు నాయకులు నర్సింహులు యాదవ్ కు శుభాకాంక్షలు తెలియజేశారు.

## వీరనారి చాకలి ఐలమ్మ



- **జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా**

**శామీర్ పేట, సెప్టెంబర్ 10(ప్రజాస్వరం) :**
సమాజంలో అణచివేతలకు వ్యతిరేకంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ నేటి యువతకు స్ఫూర్తిదాయక మని జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా బుధవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, వివిధ కుల సంఘాల ప్రతినిధులతో కలసి అదనపు కలెక్టర్ రాధిక గుప్తా జ్యోతి ప్రజ్వలన చేసి చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ చాకలి ఐలమ్మ సామాజిక సమానత్వం కోసం తన జీవితాన్ని త్యాగం చేసారని, ఆమె పోరాటం కేవలం ఒక వర్గానికే కాకుండా సమాజంలోని ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని, నేటి యువత ఐలమ్మ ధైర్యసాహసాలను ఆదర్శంగా తీసుకొవాలన్నారు. ఈ కార్యక్రమంలో బిసీ వెల్ఫేర్ అధికారి ఝాన్సీరాణి, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి కాంతమ్మ, జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి వినోద్ కుమార్, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలు










**మెదక్, సెప్టెంబర్ 10 (ప్రజా స్వరం) :** జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలను బుధవారం మెదక్ పట్టణం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుండి విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి రాధా కిషన్ మాట్లాడుతూ విద్యార్థుల లోని కళా నైపుణ్యాలను వెలికి తీసేందుకు కళా ఉత్సవ్ పోటీలు ఉపయోగ పడతాయని తెలిపారు. జిల్లా లో ఉత్తమ ప్రదర్శన చేసి రాష్ట్ర స్థాయి లో రాణించాలని, ఈ పోటీలలో గెలుపొంది, ప్రథమ స్థానంలో నిలిచిన వారు రాష్ట్ర, జాతీయ స్థాయి వరకు వెళ్ళవచ్చని అన్నారు. ఈ పోటీలు రెండు రోజుల పాటు జరుగుతాయని అన్నారు. తొలి రోజు పాటలు, వాయిద్యాల పోటీలు, సంప్రదాయ కథల పోటీ నిర్వహించారు. బుధవారం సంప్రదాయ నృత్యం, జానపద నృత్యం, డ్రామా పోటీలు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శంకర్, అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుదర్శన మూర్తి, కళా ఉత్సవ్ కమిటీ కన్వీనర్ రామేశ్వర్ ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు రేఖ, న్యాయ నిర్ణేతలు అంజా గౌడ్, లక్ష్మీప్రసన్న, గోపాల్, సిద్ధిరాములు, వంశీకృష్ణ, శశిధర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద అన్నదానం

**శామీర్‌పేట, సెప్టెంబర్10 (ప్రజాస్వరం) :** శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద ఘనంగా అన్నదానం చేపట్టారు. బుధవారం శామీర్ పేట మండలం తూంకుంట మున్సిపల్ ఉప్పర్ పల్లి పరిధిలోని శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద నగరం లోని బోరబండ కు చెందిన కీ.శే.దొడ్ల లక్ష్మీనారాయణ గౌడ్ జ్ఞాపకార్థం ఆయన భార్య చెన్నమ్మ, కొడుకులు, కోడండ్లు, మనుమండ్లు మనుమరాలు, వారి కుటుంబ సభ్యులు అన్నదానం చేపట్టారు. వివిధ గ్రామాల భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.







## ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం

- **ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ జగదీశ్వరి**

**మన్యం జిల్లా, సెప్టెంబర్ 10 (ప్రజాస్వరం) :** ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరిని ఆదుకోవడమే లక్ష్యంగా నారాచంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వ విప్ & కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరిఅన్నారు. గరుగుబిల్లి మండలం కొంకడివరం, బురదవెంకటపురం గ్రామాలకి చెందిన అల్లు సత్యన్నారాయణ, పైలా జగదీష్ అనారోగ్యానికి గురై ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారనే విషయం ప్రభుత్వ విప్ మరియు కురుపాం శాసనసభ్యురాలు దృష్టికి రావడంతో, వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి సహాయమందేలా కృషి చేసి, సహాయనిధి నుండి అల్లు సత్యనారాయణ కి 1,85,000/, పైలా జగదీష్ కి 1,69,323/ రూపాయల చెక్కులను బుధవారం నాడు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం గుమ్మలక్ష్మీ పురంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికి సహాయం అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారాచంద్ర బాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, ఈ మధ్యకాలంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి అందించిన ఆర్థిక సహాయమే అందుకు నిదర్శనమని ఎమ్మెల్యే గారు అన్నారు. కార్యక్రమంలో గరుగుబిల్లి మండలం నాయకులు మరడన తవిటినాయుడు, క్లస్టర్ నాయకులు కండైన బలరాం నాయుడు ముదిలి బాబు విజయవాంకుశం, నారాయణస్వామి నాయుడు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై దుష్ప్రభావం

**మెదక్, సెప్టెంబర్ 10 (ప్రజా స్వరం) :** మెదక్ పట్టణంలోని గీతా ఉన్నత పాఠశాలలో "స్టూడెంట్ లెడ్ మూమెంట్" కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా విద్యార్థి, యువత భవిత పై మొబైల్ ఫోన్, మాదకద్రవ్యాల దుష్ప్రభావం అనే అంశాలపై సమాజంలో చైతన్యం కలిగించేందుకు పాఠశాల నుంచి రాందాస్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. గీతా విద్యాసంస్థల సెక్రటరీ రామాంజనేయులు, కరస్పాండెంట్ మాధవి రామాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రవికుమార్ మాట్లాడుతూ మొబైల్ ఫోన్లు విద్యార్థుల విలువైన సమయాన్ని వృధా చేస్తున్నాయని, విద్యార్థులు సెల్ ఫోన్ వాడకం తగ్గించాలన్నారు. మెదక్ పట్టణ సీఐ మహేష్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసే యువత కొకైన్, గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు బానిసలు కావొద్దన్నారు.




## మద్యం అక్రమ అమ్మ కాలపై ప్రత్యేక డ్రైవ్.. నలుగురి అరెస్ట్

**మన్యం జిల్లా, సెప్టెంబర్ 10 ( ప్రజాస్వరం ) :** అనధికార మద్యం అమ్మకాలపై ఎక్సైజ్ శాఖ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తుందని శాఖ సి ఐ శ్రీనివాస్ రావు అన్నారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు కురుపాం ఎక్సైజ్ స్టేషన్ పరిధి లో అనధికార మద్యం అమ్మకాలు (బెల్ట్ షాపులు), నిర్వహిస్తున్న వారి కోసం, బహిరంగ ప్రదేశాలలో మద్యం త్రాగడం పై గత ఐదు రోజులురోజులుగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న నలుగురు పై కేసులు నమోదు చేసి వారి వద్ద నుండి 32 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసు రావు మాట్లాడుతూ గ్రామాలలో ఎవరైనా గాని అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు తెలిస్తే ఎక్సైజ్ డిపార్ట్మెంట్ కి సమాచారం ఇవ్వాలని కోరారు.

## బస్సు సౌకర్యం కల్పించండి

**మన్యం జిల్లా, సెప్టెంబర్ 10 (ప్రజా స్వరం) :** ఉచిత బస్సు సౌకర్యాన్ని పొందలేకపోతున్న గిరిజన కుటుంబాలకు చెందిన స్త్రీలు మరియు గర్భిణీ స్త్రీలు కొమరాడ రాంబద్రపురం ప్రాథమిక ఆరోగ్యంద్రాలకు ప్రతినెల 9 మరియు 10వ తేదీలలో రక్త పరీక్షలకు వివిధ రకాల పరీక్షలకు వస్తున్న నేపథ్యంలో గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం శ్రీ సత్య సేవ సంస్థ వారు అందజేసే పరిస్థితి గాని ప్రభుత్వం మాత్రం ఎటువంటి ఆహారం గర్భిణీ స్త్రీలకు అందించిన పరిస్థితి కూటమి ప్రభుత్వం మహిళలందరికీ ఉచిత బస్ సౌకర్యం కల్పించినప్పటికీ ఆ దిశగా ఆర్టీసీ డిపో అధికారులు నిర్లక్ష్యం వల్ల గిరిజన గర్భిణీ మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం దూరం? ఏజెన్సీ ప్రాంతంలో గతంలో పార్వతీపురం డిపో నుండి బస్ సౌకర్యం ఉన్నప్పటికీ కరోనా వైరస్ వ్యాప్తి చెందిన సందర్భం లో నిలుపుదల చేసిన బస్సును మళ్లీ పునరుద్ధరించకపోవడం ఆర్థికంగా చితికిపోతున్న గిరిజన ప్రజలు వెంటనే పార్వతీపురం డిపో నుండి కూనేరు నుండి మసిమండ గ్రామం మీదగా ఎండబధ్ర గ్రామం మీదుగా లంజి గ్రామం వరకు బస్సు సౌకర్యం వెంటనే కల్పించి అన్ని విధాలుగా గిరిజన ప్రజలతోపాటు గర్భిణీ స్త్రీలకు మెరుగైన ప్రయాణం కల్పించాలని కోరుతూ కొమరాడ మండలం రాంబద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఈరోజు అనగా బుధవారం గర్భిణీ స్త్రీలతో కలిసి నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళలందరికీ ఉచిత బస్సు సౌకర్యం కల్పించినప్పటికీ కూడా ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం వల్ల కొమరాడ మండలంలో గిరిజన పంచాయితీలైన మసిమండ కుంతేసు పూ దేస్ సొల పదం పంచాయితీలకి సంబంధించిన గర్భిణీ స్త్రీలు ఆటోలు పై ప్రాథమిక ఆరోగ్యంద్రానికి వస్తూ ఆర్థికంగా ఇబ్బంది పడుతూ ఆటోలు బుక్ చేసుకుని ఆశ వర్కర్లు కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు గర్భిణీ స్త్రీలను తీసుకొని ఆర్థికంగా ఆటోలు బుక్ చేసుకుని వస్తున్న పరిస్థితి ఉందని సుమారు 40 కిలోమీటర్ల దూరం నుండి గర్భిణీ స్త్రీలు ఆటోలో వస్తున్న సందర్భంగా అనేక ఇబ్బందులకు గురవుతున్న పరిస్థితి ఉందన్నారు. వెంటనే ఆర్టీసీ బస్సు వేసి అన్ని వర్గాల మహిళలతో పాటు గర్భిణీ స్త్రీలకు కూడా ప్రత్యేక ప్రయాణం సౌకర్యం కల్పించే విధంగా చూడాలని కోరారు.





# మంగళ వాయిద్యాలు మన సంస్కృతికి ప్రతీకలు -జిల్లా ఎస్పీ.

- జిల్లా ఎస్పీని ఘనంగా సన్మానించిన నాయి బ్రాహ్మణులు
- పూర్వ వైభవంతో గణేష్ ఉత్సవాల నిర్వహణకు ఎస్పీ ప్రత్యేక చొరవ

**వనపర్తి, సెప్టెంబర్ 10(ప్రజాస్వరం):** మంగళ వాయిద్యాలు మన సంస్కృతికి ప్రతిబింబాలని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వనపర్తి జిల్లాలోని నాయిబ్రాహ్మణ సంఘం సభ్యులు వినాయక ఉత్సవాలు సోదరాభావంతో భక్తిశ్రద్ధలతో సాంస్కృతిక కార్యక్రమాలు, బాజ భజంత్రి, చెక్కభజన, కోలాటం, సంప్రదాయ నృత్యాలతో అందరూ భాజ భజంత్రీలతో గణనాథునికి భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనాలు సంస్కృతి సంప్రదాయాలను చాటి చెప్పే విధంగా ముగించడానికి కృషిచేసిన జిల్లా ఎస్పి రావుల గిరిధర్ ను జిల్లా నాయి బ్రాహ్మణ సంఘం సభ్యులు శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సంవత్సరం వినాయక నిమజ్జనంలో సంస్కృతి సంప్రదాయాలు చాటి చెప్పే మంగళ వాయిద్యాలు డోలు సన్నాయిలు, కోలాటాలు, చక్క భజనలు చేస్తూ నిమజ్జనం పూర్తి చేయమని ఎస్పీ రావుల గిరిధర్ ఇచ్చిన పిలుపు మేరకు వనపర్తి జిల్లాలోని వినాయక మండప నిర్వాహకులు ఆపిలుపును స్వాగతిస్తూ సంప్రదాయ వాయిద్యాలు, డోలు సన్నాయి, వాయిద్య కారును గుర్తించి వారిని ఆహ్వానించి నిమజ్జనం పూర్తి చేసినందుకు తమ వాయిద్య కారులను గుర్తించినందుకు వారికి ఆదరణ కల్పించినందుకు జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మన సంస్కృతికి ప్రతీకలైన మంగళ వాయిధ్యాలను ఆ కళాకారులను మనం గౌరవించి ప్రోత్సహించవలసిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన అన్నారు. వనపర్తి జిల్లా వ్యాప్తంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు, శోభాయాత్ర, నిమర్జనం కార్యక్రమాలు అత్యంత ప్రశాంత వాతావరణంలో జరిగాయని జిల్లా ఎస్పీ అన్నారు. ఉత్సవం ఎలాంటిదైనా అన్ని వర్గాల ప్రజలు సోదరాభావంతో భక్తిశ్రద్ధలతో సాంస్కృతిక కార్యక్రమాలు, బాజ భజంత్రి, చెక్కభజన, కోలాటం, సంప్రదాయ నృత్యాలతో శాస్త్రీయంగా జరుపుకున్నారని అన్నారు, అదేవిధంగా నాయి బ్రాహ్మణులు ఆర్థికంగా ఉపాధి పొందారని గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఇదే స్ఫూర్తి భవిష్యత్తులో కూడా చూపాలని ఎస్పీగ ఈ సందర్భంగా కోరారు. ఉత్సవం ఏదైనా ప్రజలంతా సంతోషంగా నిర్వహించుకోవాలని జిల్లా పోలీస్ శాఖ తరపున పూర్తి భద్రత రక్షణ ఎల్లప్పుడు కల్పించడం జరుగుతుందని అన్నారు. గణేష్ ఉత్సవాల నిర్వహణలో జిల్లా యంత్రాంగానికి, జిల్లా పోలీస్ లకు సహకరించిన ప్రజలకు, ఉత్సవ కమిటీలకు, భక్తులకు, ముఖ్యంగా సమయ స్ఫూర్తి చూపిన యువతకు ఎస్పీ ఈ సందర్భంగా అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేసిన అన్ని శాఖల అధికారులకు, బందోబస్తు నిర్వహించిన పోలీసు సిబ్బందికి అందరికి ఎస్పీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐనరేష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు అప్పలనాయుడు, శ్రీనివాస్, నాయిబ్రాహ్మణ సభ్యులు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రతినిధులతో సమీక్షా పథకాల పంపిణీ కార్యక్రమాలు చేపట్టాలి

- తుమ్మల వెంకట్ రెడ్డి బిఆర్ఎస్ అధ్యక్షులు



**వలిగొండ సెప్టెంబర్ 10(ప్రజాస్వరం):** మండల పరిషత్ కార్యాలయంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మండల అభివృద్ధి కోసం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మరియు అధికారులతో పాటు కొందరు కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులతో సమీక్ష నిర్వహించారు కాంగ్రెస్ నాయకులకు ఎలాంటి ప్రోటోకాల్ లేకున్నా వారు సమీక్ష కార్యక్రమంలో పాల్గొనడాన్ని బిఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండించారు. ఇది ప్రజాస్వామ్య దేశం చట్టాలను అతిక్రమించి కాంగ్రెస్ నాయకులు సమీక్ష కార్యక్రమంలో పాల్గొనడం దుర్మార్గమైన చర్య గతంలోనూ కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీలోను మరియు ఇందిరమ్మ ఇండ్లు పంపిణీ కార్యక్రమంలోను మరియు రేషన్ కార్డుల పంపిణీలోను సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలోనూ ఎలాంటి అర్హత లేకున్నా కాంగ్రెస్ నాయకులు వీటిని ప్రారంభించడం జరిగింది. రాబోయే రోజుల్లో ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజా ప్రతినిధులు కాకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులు అనర్హులు ప్రారంభిస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రోటోకాల్ ఉన్నవారికే అధికారులు పంపిణీ కార్యక్రమాలు చేయించాలని లేనిపక్షంలో జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేస్తామని వలిగొండ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల వెంకట్ రెడ్డి హెచ్చరించారు.

# రజక సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ వీర నారి చాకలి ఐలమ్మ వర్ధంతి.

**వనపర్తి, సెప్టెంబర్ 10(ప్రజాస్వరం):** తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు వనపర్తి జిల్లా రజక సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమానికి మార్కెట్ కమిటీ చైర్మన్ బి శ్రీనివాస్ గౌడ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బి కృష్ణ, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, మాజీ కౌన్సిలర్ జిజే శ్రీనివాసులు పాల్గొని ఆమె నిలువెత్తు విగ్రహానికి పుష్పమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ తల్లి వీరనారి చాకలి ఐలమ్మ ఉద్యమమే ఊపిరిగా పేదల శ్రేయస్సు లక్ష్యంగా, వెట్టిచాకిరి విముక్తి కోసం, భూమి భుక్తి కోసం పోరాడిన దీశాలి అని కొనియాడారు. వనపర్తి పట్టణంలో రజక సంఘం పెద్దలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. రజక సంఘం నాయకులు కరాటే శీను, భాస్కర్, జనార్ధన్,రజక సంగం సీనియర్ నాయకులు బండలయ్య, టిపిసిసి వనపర్తి అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ద్యారపోగు వెంకటేష్, వనపర్తి గద్దర్ రాజారాం ప్రకాష్, గంధం నాగరాజు, రజక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# గ్రామీణ ప్రాంత రోడ్లను అభివృద్ధి కోసం ప్రజా ప్రభుత్వం కృషి..

- రాష్ట్రంలో భూపాలపల్లి నియోజకవర్గన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా.. ఎమ్మెల్యే జీఎస్సార్..
- ఉమ్మడి రేగొండ గోరికొత్తపల్లి మండలాల్లో రూ.1475 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- వెంకటేశ్వర్లపల్లిలో గ్రామ గ్రామైఖ్య భవనం మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చిన మహిళలు..



**రేగొండ, సెప్టెంబర్ 10(ప్రజాస్వరం):** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రుల సహకారంతో భూపాలపల్లి నియోజకవర్గన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిలో తీర్చిదిద్ది రాష్ట్రంలో ఆదర్శ నియోజకవర్గంగా ఉండేలా కృషి చేస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పేర్కొన్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని ఉమ్మడి రేగొండ గోరుకొత్తపల్లి మండలాల్లో బుధవారం ఎమ్మెల్యే గండ్ర పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఉమ్మడి రేగొండ మండలంలోని పలు గ్రామాల అభివృద్ధిలో భాగంగా అంతర్గత రోడ్లు, గ్రామీణ ప్రాంత రోడ్లను అభివృద్ధి చేసేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని, నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని రేగొండ, కొత్తపల్లిగోరి మండలాల్లోని వివిధ గ్రామాలల్లో ఎమ్మెల్యే పర్యటించారు. మొత్తం రూ.14 కోట్ల 75 లక్షలతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కొత్తపల్లిగోరి మండలం సుల్తాన్ పూర్ లో సుల్తాన్ పూర్ గ్రామం నుండి కొత్తపల్లి (వయా వెంకటేశ్వర్లపల్లి, కోనరావు పేట) గ్రామం వరకు సీఆర్ఆర్ నిధులు రూ.450 లక్షలు ఐటీడీఏ నిధులు రూ.275 లక్షలతో నిర్మించనున్న నూతన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శంకుస్థాపన చేశారు. రేగొండ మండలం భాగిర్థిపేట గ్రామంలో ఊరకుంట మత్తడి నుండి వ్యవసాయ పొలాల వరకు రోడ్డు రూ.30 లక్షలు, గూడెపల్లి గ్రామంలో గూడెపల్లి నుండి పొనగండ్ల వరకు రోడ్డు నిర్మాణ పనులు రూ.160 లక్షలు, కొడవటంచ గ్రామంలో రూ.29 లక్షలతో కొత్తగా నిర్మించిన హెల్త్ సబ్ సెంటర్ ను ప్రారంభించారు. దమ్మన్నపేట గ్రామంలో పోచమ్మ ఆలయ నిర్మాణ పనులకు రూ.4.95 లక్షలతో శంకుస్థాపన చేశారు. అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా కొత్తపల్లిగోరి మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో మైదాకులపల్లి నుండి బుగులోనిజాతర వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు రూ.150 లక్షలు, సూరవాడ నుండి ఎరుకలివారికుంట వరకు వయా శ్మశానవాటిక రోడ్డు నిర్మాణ పనులు రూ.30 లక్షలు, సుల్తాన్ పూర్ తాటివనం నుండి వ్యవసాయ పొలాల వరకు రోడ్డు నిర్మాణ పనులు రూ.50 లక్షలు, కొత్తపల్లిగోరి లో కొమ్మాల చెరువు నుండి వాగు వరకు రోడ్డు నిర్మాణ పనులు రూ.20 లక్షలు, పప్పుల రవి పొలం నుండి రావుల బాపురావు పొలం వరకు రోడ్డు నిర్మాణ పనులు రూ.40 లక్షలు, నిజాంపల్లి గ్రామంలో గూడ పైడి ఇంటి నుంచి ఓదెల అశోక్ పొలం వరకు రోడ్డు నిర్మాణ పనులు రూ.40 లక్షలు, చిన్నకోడెపాకలో బండి మల్లయ్య ఇంటి నుంచి మాటు వరకు రోడ్డు నిర్మాణ పనులు రూ.20 లక్షలతో అభివృద్ధి పనులకు ప్రజా ప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నేతలతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. పార్టీలకతీతంగా అన్ని గ్రామాలను అభివృద్ధి పరచనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రజాప్రతినిధుల సమన్వయంతో, ప్రజల భాగస్వామ్యంతో సీఎం నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అభివృద్ధి చేయడానికి దోహదపడుతుందని తెలిపారు. బుధవారం నాణ్యతతో పాటు సకాలంలో పూర్తయ్యేలా కాంట్రాక్టర్లు, గుత్తేదారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేస్తూ, ప్రతి గ్రామంలో సమగ్రాభివృద్ధి సాధించడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే జిఎస్ రావు చెప్పారు.

**వెంకటేశ్వర్లపల్లిలో గ్రామ గ్రామైఖ్య భవనం మంజూరు చేయాలి**

వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో గ్రామ గ్రామైఖ్య భవనం మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుకు శివమణి గ్రామైఖ్య మహిళలు తమ వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామంలో మొత్తం 25 సంఘాలు 320 మంది సభ్యులు ఉన్నారని, ప్రతి నెల సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి గది లేకపోవడం ఇబ్బందిగా ఉందని ఎమ్మెల్యేకు సభ్యులు తెలిపారు. కాగా, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. త్వరలోనే భవనం మంజూరు ఇచ్చి శంకుస్థాపనకు మళ్ళీ వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి వస్తానని ఎమ్మెల్యే చెప్పారు. అవును అభివృద్ధి శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర వెంట కలెక్టర్ రాహుల్ శర్మ, తాసిల్దార్ కె శ్వేత, లక్ష్మి రాజయ్య, ఎంపీడీవోలు ఎం వెంకటేశ్వరరావు, గడ్డం రాంప్రసాద్ రావు, డాక్టర్ హిమబిందు, డాక్టర్ రూపేష్, పి ఆర్ డి ఇ గిరిధర్, ఏఈ నరికే తిరుపతి, ఆయా గ్రామాల కార్యదర్శులు రాంబాబు, జీవిత, అమూల్య, వేల్పుల సరిత, స్రవంతి, మాచర్ల సతీష్, శ్రావణ్, కోటంచ స్పెషల్ ఆఫీసర్ మైథిలి, ఉమ్మడి మండల పార్టీ అధ్యక్షులు ఇప్ప కాయల నరసయ్య, సూదనబోయిన ఓం ప్రకాష్, జిల్లా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కిష్టయ్య, పిఎసిఎస్ చైర్మన్ నడిపెల్లి విజ్జన్ రావు, ఆలయ చైర్మన్ ముల్కనూరు బిక్షపతి,మాజీ జెడ్పిటిసి పత్తి ప్రభాకర్, ఎస్ ఆర్ ఎస్ మాజీ చైర్మన్ నడిపల్లి వెంకట్రావు, సూరం వీరేందర్, పుల్లూరి బాబురావు, మటిక సంతోష్, దుగ్యాల రాజేశ్వరరావు, క్యాసెట్టి రాజయ్య, కానుగుల తిరుపతి, పత్తి తిరుపతి,తోకల సురేందర్ రెడ్డి, పున్నం రవి, మేకల బిక్షపతి, టౌన్ అధ్యక్షులు ఏనుగు రవీందర్ రెడ్డి, పొనుగోటి వీరబ్రహ్మం, వావిలాల రమేష్, అమ్ముల సదానందం, రాజు, మైస బిక్షపతి, పట్టెమ్ శంకర్, చిగురు మామిడి కుమారస్వామి, బండి సాయిల్ గౌడ్, సందెల మధుకర్, మాజీ సర్పంచులు అంబాల చందు గౌడ్, పాత పెల్లి సంతోష్, బొజ్జం రవి,క్యాతం సదయ్య, ఆవుల మహేందర్, కనకం రమేష్, మహమ్మద్ సాబీర్, బండి శ్రీనివాస్ గౌడ్, నాగపురి శ్రీధర్ గౌడ్, కోయిల క్రాంతి, గాజ వీరస్వామి,తదితర గ్రామాలకు చెందిన మాజీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ శ్రేణులు ఉన్నారు.



# తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలి

- అమరచింత మండల కేంద్రంలో కామ్రేడ్ ఐలమ్మ 40 వర్ధంతి నిర్వహించడం జరిగింది

**మక్తల్ ప్రతినిధి సెప్టెంబర్ 10(ప్రజాస్వరం):** సిపిఎం అమరచింత మండల కార్యదర్శి వర్గ సభ్యులు బి వెంకటేష్ ఆర్యన్ రమేష్ ఎస్ అజయ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట దినాన్ని నిర్వహించాలని కోరారు. తెలంగాణ రైతంగాసాయుధ పోరాటాన్ని అధికారికంగా నిర్వహించాలంటే స్వరాష్ట్రం కావాలని ఆనాడు స్వరాష్ట్రం తెచ్చుకున్నాం, ఆనాటి రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతూ వస్తుండేటివి ఇప్పుడు స్వరాష్ట్రమైంది వచ్చి 13 సంవత్సరాలు అవుతున్న నేటికీ తెలంగాణ సాయుధ పోరాటాన్ని అధికారికంగా మొన్న ఉన్న టిఆర్ఎస్ ప్రభుత్వం గానీ, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం గానీ తెలంగాణ సాయుధ పోరాటాన్ని అధికారికంగా నిర్వహించట్లేదు, తక్షణమే తెలంగాణ సాయుధ పోరాటాన్ని అధికారికంగా ప్రభుత్వం నిర్వహించాలి అని సిపిఎం డిమాండ్, చేస్తున్నాది 1947 ఆగస్టు 15న భారతదేశనికి స్వతంత్రం సిందించిన తెలంగాణ రాష్ట్రానికి మాత్రం భారత దేశంలో విలీనం కాలేదు, ఆనాటి నైజాం నవాబునేను హైదరాబాద్ సంస్థానాన్ని ప్రత్యేక దేశంగా ప్రకటించుకుంటానని కరాకండిగా చెప్పడం జరిగింది, ఆనాటి, 1947 సెప్టెంబర్ 10 న తెలంగాణ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ పోరాట సాగిన పోరాటంలో 4500 మంది రానార్పణ చేశారు, దున్నే వాడికి భూమి కావాలని 10 లక్షల ఎకరాలను పంచిన చరిత్ర కమ్యూనిస్టు లకు మాత్రమే దక్కిందన్నారు, తెలంగాణ సాయుధ పోరాటం ద్వారా 3000 గ్రామాలను విలీనం చేయడం, సాయుధ పోరాటం ద్వారా నైజాం నవాబులను మెడలు వంచి తెలంగాణను భారతదేశంలో విలీనం చేపించడంలో మహోత్తమైన జరిగిన పోరాటం సమరంలో నవాబు నైజాములు తలొగ్గి భారతదేశంలో తెలంగాణను విలీనం చేస్తామని నవాబు అంగీకరించడంతో ఆనాడు పటేల్ సైన్యం ఆలోచించి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు జరిగితే కమ్యూనిస్టు రాజ్యం ఏర్పడుతుందని భయపడి పోలీస్ బలగాలతో వచ్చి మేము భారతదేశంలో విలీనం చేస్తున్నాము అని చెప్పి తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించే విధంగా ఆనాటి పాలకులు చిత్రీకరించారు నేటికీ తెలంగాణ సాయుధ పోరాటం ప్రపంచ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించబడింది ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు డి నరసింహ బుచ్చన్న శ్యాంసుందర్ శ్రీను ఫయాజ్ తిరుమల శ్రీను అంజి విష్ణు డి సి రాజేందర్ వేణు రుక్మాదిన్ తదితరులు పాల్గొన్నారు.



# చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి

**ఎల్లంకి మహేష్ సిపిఐ**

**వలిగొండ సెప్టెంబర్ 10(ప్రజాస్వరం):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఎల్లంకి మహేష్ సిపిఐ మండల సహాయ కార్యదర్శి, సల్వాదిరి రవీందర్ పట్టణ కార్యదర్శి సంయుక్తంగా మాట్లాడుతూ నైజాం సర్కారు అండతో రెచ్చిపోయిన భూస్వాముల, దొరల, దేశ్ ముఖ్ ల , రాజకర్ల, పటేల్, పట్వారీల, పెత్తనాన్ని, దౌర్జన్యాలను, అరాచకాలను ఎదిరించి. కాల్మోక్త బాంచన్ దొర అన్న చెతులే బందూకూలు చెతా బట్టి భూస్వాముల, దొరల, దేశ్ ముఖ్ ల రాజకర్ల, పటేల్ పట్వారీల, గుండెల్లో రైలు పరుగెత్తించిన వీరనారి చాకలి ఐలమ్మ. కమ్యూనిస్టు పార్టీ యోధురాలు, కుల, మతాలకు అతీతంగా మట్టి మనుషులు పోరాడి విజయం సాధించిన. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి. మతం రంగు పూస్తున్న నైజాం వారసులైన నేటి మతోన్మాదులకు వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో బుద్ధి చెప్పుదాం. చాకలి ఐలమ్మ పోరాట వారసత్వాన్ని మతవాదుల నుంచి కాపాడుకుందాం.భవిష్యత్ తరానికి చరిత్రను అందిండ్దాం అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సమితి సభ్యులు పోలపాక యాదయ్య, బోడిగే సుదర్శన్, సుద్దాల సాయికుమార్, మారోజు నరసింహ చారి, గుండె గాని నాగరాజు, కనకబోయిన ఆంజనేయులు, అర్జున్,చిలకమర్రి నర్సమ్మ, పాండల నరసమ్మ, జోర్కు యాదమ్మ, పాక ఐలమ్మ, యాట భూదేవమ్మ, వీరుడు లక్ష్మమ్మ, జోగుల ముత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఐలమ్మ జీవితం ఆమె పోరాట స్ఫూర్తి అందరికీ స్ఫూర్తిదాయకం.

**వనపర్తి, సెప్టెంబర్ 10(ప్రజాస్వరం):** నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వీరవనిత చాకలి ఐలమ్మ అని, ఆమె జీవితం అందరికి స్ఫూర్తి దాయకమని కలెక్టరేట్ ఏఓ భాను ప్రకాష్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ సముదాయంలో చాకలి ఐలమ్మ వర్ధంతి పురస్కరించుకొని వెనకబడిన కులాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి అధికారులు, ప్రజాసంఘాల నాయకులు నివాళులర్పించారు. ఏఓ మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వీరవనిత చాకలి ఐలమ్మ అని, ఆమె జీవితం అందరికి స్ఫూర్తి దాయకమన్నారు. వీరనారి చాకలి ఐలమ్మ అన్ని వర్గాల హక్కుల సాధన కోసం పోరాటం చేసిన ధీరవనిత అని పేర్కొన్నారు. సబ్బండ వర్గాల ఆత్మగౌరవ ప్రతీకగా ఐలమ్మ అందరికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. తెలంగాణ సాయుధ పోరాట కాలంలో ఐలమ్మ ప్రదర్శించిన ధైర్య సాహసాలు, చైతన్యం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. చాకలి ఐలమ్మ బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ జీవితంపై రాజా రామ్ ప్రకాష్ ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో డివైస్ ఓ సుధీర్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారి ముజాహిద్దీన్ ఖాన్, రజక సంఘం జిల్లా నాయకులు బండలయ్య, ఇతరులు, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు వెంకటేష్, రాజు, ప్రజా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# క్రికెట్ స్టేడియం దారి

**2కోట్ల స్థలానికి రెక్కలు**



**మధురవాడ, సెప్టెంబర్ 10(ప్రజాస్వరం):** సర్వే నెం.66/3లో సుమారు రెండువందల గజాల స్థలం ఆక్రమణ గతంలో ఇదే భూమి వ్యవహారంలో జీవీఎంసీ ఏసీపీ సస్పెండ్ 2024లో పనులు ఆపిన బిల్డర్ తిరిగి పనులు ప్రారంభించిన వైనం సర్వే నెంబరు మార్చి తిరిగి పనులు ప్రారంభించినట్లు ఆరోపణలు రెవెన్యూ అధికారులు విచారణ చేయాలంటున్న స్థానికులు, నెం.66/3లోని సుమారు 200 గజాల స్థలాన్ని కబ్జా చేసినట్లు తెలిసింది. దీనిలో భవన నిర్మాణానికి 2024లో అనుమతి ఇచ్చిన టౌన్ ప్లానింగ్ అధికారిని జిల్లా కలెక్టర్ సస్పెండ్ కూడా చేశారు. కాని ఇప్పుడు సర్వే నెంబరు మార్పుతో తిరిగి అదే భవనపు పనులు ప్రారంభించారు. దీనివెనుక స్థానిక రెవెన్యూ, జీవీఎంసీ అధికారుల హస్తం ఉన్నట్లు స్థానికంగా ఆరోపణలు వినబడుతున్నాయి. స్థానిక రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలం కబ్జాకు గురవుతున్నా స్పందించక పోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ భూమిలో భవన నిర్మాణానికి అనుమతి ఇచ్చిన జీవీఎంసీ జోన్2 టౌన్ ప్లానింగ్ అధికారిని జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేసిన ఘటన మరువకనే తిరిగి అదే స్థలంలో భవన నిర్మాణపు పనులు ప్రారంభమయ్యాయి. సర్వే నెంబరు మార్చి నిర్మాణపు పనులు ప్రారంభించినట్లు తెలిసింది. పోతినమల్లయ్యపాలెం క్రికెట్ స్టేడియం ఎదురుగా శ్రీనివాసనగర్ సర్వేసంబంధిత బిల్డర్ ఇరు శాఖల అధికారులకు భారీ మొత్తంలో ఆఫర్ ఇచ్చినట్లు తెలిసింది. అందువలన సర్వే నెంబరు మార్చి తిరిగి పనులు ప్రారంభించినట్లు తెలిసింది. తక్షణమే రెవెన్యూ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో సుమారు రెండు కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ స్థలం కబ్జాదారుల పరం అవుతుందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

# బాల్యం నేర్పించింది అదే!



''నేను బాల్యంలో పది పాఠశాలలు మారాను. అదే నాకు ఈరోజు ఎక్కడైన సర్దుకుపోయే సామర్థ్యాన్ని ఇచ్చింద''ని అంటోంది కథానాయిక రకుల్ ప్రీత్ సింగ్. 'మేరే హస్బెండ్ కీ బీవీ' సినిమాతో ఈ ఏడాది ప్రారంభంలోనే ప్రేక్షకుల్ని పలకరించిందీమె. ప్రస్తుతం అజయ్ దేవగణ్‌తో కలిసి 'దే దే ప్యార్ దే 2'తో బిజీగా గడుపుతోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రకుల్ మాట్లాడుతూ.. ''మాది ఆర్మీ నేపథ్యమున్న కుటుంబం. దీంతో చిన్నప్పుడు దాదాపు10 పాఠశాలలు మారాల్సి వచ్చింది. ఆ జీవితమే ఇప్పుడు సర్దుకుపోయే మనస్తత్వాన్ని, భిన్న సంస్కృతులున్న వ్యక్తులతో తొందరగా కలిసిపోయేలా చేసింది. సినిమా షూటింగ్ కోసం ఇంటికి దూరంగా ఉన్నప్పుడు కూడా.. కుటుంబం సభ్యులను మిస్ అవుతున్నట్లు అనిపించదు. ఎందుకంటే అన్ని విషయాల పట్ల బలంగా, ధైర్యంగా ఉండేలా బాల్యం నాకు నేర్పింద''ని చెప్పకొచ్చింది.

# మెగా కుటుంబంలో కొత్త అతిథి..
# వరుణ్ తేజ్-లావణ్యకు బేబీ బాయ్



మెగా కుటుంబంలో సంతోషకరమైన వాతావరణం నెలకొంది. వరుణ్ తేజ్, ఆయన భార్య లావణ్య త్రిపాఠి దంపతులకు పండంటి బాబు పుట్టాడు. దీంతో మొత్తం మెగా ఫ్యామిలీ ఆనందంలో మునిగిపోయింది. మొత్తానికి వరుణ్–లావణ్య జంట తమ మొదటి సంతానానికి స్వాగతం పలికారు. తల్లి, బిడ్డ ఇద్దరు ఆరోగ్యంగా ఉన్నారని కుటుంబ వర్గాలు తెలిపాయి. ఈ శుభవార్త బయటకు వచ్చిన వెంటనే మెగా అభిమానులు సోషల్ మీడియాలో శుభాకాంక్షలు వర్షం కురిపిస్తున్నారు.

ఇక వరుణ్–లావణ్య ప్రేమ కథ బాలీవుడ్ స్టైల్‌లో సాగింది. దాదాపు ఎనిమిదేళ్ల ప్రేమ తరువాత 2023లో కుటుంబ సభ్యుల ఆశీర్వాదాలతో వీరిద్దరూ పెళ్లి చేసుకున్నారు. పెళ్లి తరువాత లావణ్య త్రిపాఠి పూర్తిగా సినిమాలకు గుడ్‌బై చెప్పి, వ్యక్తిగత జీవితానికే ప్రాధాన్యతనిచ్చారు. ఈ ఏడాది మే 6న ఇన్‌స్టాగ్రామ్‌లో లావణ్య తన గర్భధారణ విషయాన్ని అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచే మెగా ఫ్యాన్స్ బేబీ అప్‌డేట్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పుడు పండంటి బాబు పుట్టడంతో ఆ ఆనందం రెట్టింపైంది. లావణ్య, వరుణ్ దంపతులు తల్లిదండ్రుల అయ్యారని తెలిసి సినీ వర్గాలు, అభిమానులు సోషల్ మీడియాలో ట్రెండింగ్ హ్యాష్‌ట్యాగ్‌లతో శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.



# మొదటి ఫీమేల్ సూపర్ హీరోగా గుర్తింపు.. ఎంతో గర్వంగా ఉంది

'లోక చాప్టర్ 1: చంద్ర' (తెలుగులో కొత్త లోక) చిత్రంతో థియేటర్లలో కల్యాణి ప్రియదర్శన్ సందడి చేస్తున్నారు. మలయాళ హీరో దుల్కర్ సల్మాన్ నిర్మించిన ఈ సినిమా విమర్శకుల ప్రశంసలు అందుకుంటూ రూ.కోట్లు వసూలు చేస్తోంది. దీనిపై కల్యాణి ప్రియదర్శన్ ఆనందం వ్యక్తంచేశారు. దేశంలోనే మొదటి ఫీమేల్ సూపర్ హీరో సినిమాలో నటించడం గర్వంగా ఉందన్నారు.

''మలయాళంలో 'లోక చాప్టర్ 1: చంద్ర' భారీ విజయం సాధించిన దగ్గర నుంచి అందరూ నన్ను ఫీమేల్ సూపర్ హీరో అని పిలుస్తున్నారు. నా ఆనందాన్ని మాటల్లో చెప్పలేను. ఈ సినిమా విజయం సాధించడానికి నాతో పాటు మా టీమ్‌లోని వారంతా కష్టపడ్డారు. ఈ సక్సెస్ క్రెడిట్ వాళ్లకు కూడా వెళ్తుంది. నేను ఈ చిత్రానికి సైన్ చేసినప్పుడు ఇంత విజయం సాధిస్తుందని ఊహించలేదు. మంచి కథలో భాగం కావాలని మాత్రమే ఆలోచించాను. చిత్రీకరణ చేసే సమయంలోనే ఇది కచ్చితంగా విజయం సాధిస్తుందని అర్థమైంది. ఈ సినిమా మొత్తాన్ని నేను భుజాలపై వేసుకొని మోసానంటూ ప్రేక్షకులు నన్ను అభినందిస్తున్నారు. కానీ, మా టీమ్‌లో పురుషులు, మహిళలు అనే తేడా లేకుండా ప్రతిఒక్కరూ దీనికోసం కష్టపడ్డారు. 'లోక చాప్టర్ 1: చంద్ర' మొదటి ఫీమేల్ సూపర్ హీరో సినిమా కావడం వల్ల ఎంతోమంది స్ఫూర్తి పొందుతున్నారు. హీరోయిన్స్ కూడా ఎలాంటి పాత్రల్లోనైనా చేయగలరు అని అందరికీ నమ్మకం కలిగింది'' అని కల్యాణి ప్రియదర్శన్ చెప్పారు.

రూ.30 కోట్ల సినిమా.. రూ.200 కోట్లు వసూలు

డామినిక్ అరుణ్ తెరకెక్కించిన ఈ చిత్రం ఆగస్టు 29న ప్రేక్షకుల ముందుకువచ్చింది. దుల్కర్ దీన్ని రూ.30 కోట్లతో నిర్మించగా.. ఇప్పటివరకూ రూ.200కోట్లు వసూలు చేసింది. ఈ విషయాన్ని తెలుపుతూ చిత్రబృందం ఓ పోస్టర్ విడుదల చేసింది. దేశవ్యాప్తంగా అత్యధిక వసూలు సాధించిన నాలుగో మలయాళ చిత్రంగా నిలిచిందని పేర్కొంది.

## నిన్న ఐశ్వర్యారాయ్.. నేడు అభిషేక్ బచ్చన్: ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన దంపతులు



బాలీవుడ్ నటుడు అభిషేక్ బచ్చన్ బుధవారం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన పబ్లిసిటీ, పర్సనాలిటీ హక్కులకు రక్షణ కల్పించాలని న్యాయస్థానంలో పిటిషన్ వేశారు. కొన్ని వెబ్‌సైట్‌లు తన అనుమతి లేకుండా ఫొటోలు, వీడియోలు వాడుకుంటున్నాయని.. వాటిని ఉపయోగించేందుకు వీలులేకుండా ఆదేశాలివ్వాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. కొందరు వ్యక్తులు ఏఐతో అభిషేక్ ఫొటోలు క్రియేట్ చేసి అశ్లీల కంటెంట్‌కు ఉపయోగించుకుంటున్నట్లు నటుడి తరపు న్యాయవాది ప్రవీణ్ కోర్టుకు తెలిపారు. దీనికి సంబంధించిన పూర్తి ఆధారాలు కోర్టుకు సమర్పించినట్లు చెప్పారు. ఇక సోషల్ మీడియాలో వైరలవుతోన్న ఏఐ ఫొటోలు, వీడియోలు సెలబ్రిటీలకు తలనొప్పిగా మారాయి. తాజాగా ఇదే విషయంపై అభిషేక్ సతీమణి, నటి ఐశ్వర్యారాయ్ కూడా ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. అనుమతి లేకుండా తన ఫొటోలను, పేరును ఉపయోగించేందుకు వీలులేకుండా ఆదేశాలివ్వాలని ఆమె కోర్టును కోరారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం.. సంస్థలు/వ్యక్తులు ఐశ్వర్య పేరు, ఫొటోలు ఉపయోగించకుండా తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేస్తామని సూచించింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999